# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

సెప్టెంబర్ 20, 2012

## ప్రపంచవ్యాప్తంగా ముస్లిం ప్రజల మత మనోభావనలను గాయపరుస్తున్న అమెరికా సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని ఖండించండి !

అమెరికాలో ముస్లిం వ్యతిరేక, ప్రతీఘాతుక క్రిస్టియన్ మత దురహంకారుల బృందం ఒకటి 'ఇన్నోసెన్స్ ఆఫ్ ముస్లిమ్స్' అనే విడియో సినిమాని తీసి ఇంటర్నెట్‌లో వివిధ విడియో పంపక సైట్లలో అందుబాటులో వుంచింది. ఇది మహమ్మద్ ప్రవక్తను అవమానించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ముస్లింల మత మనోభావనలను గాయపరిచింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ముస్లింలు పెద్దెత్తున నిరసనలు వ్యక్తం చేయసాగారు. ఇది లిబియా నుండి మొదలై, ట్యునిసియా మీదుగా థాయ్‌లాండ్, ఇండొనీసియా, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, కాశ్మీర్ నుండి భారతదేశం వరకు, ముఖ్యంగా ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా, అరబ్ దేశాలకు విస్తరించింది. సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ముస్లింల మత మనోభావనల మీద అమెరికా చేసిన ఈ సాంస్కృతిక దాడిని తీవ్రంగా ఖండిస్తూ, అమెరికా ప్రభుత్వమూ, ఈ సినిమాని తీసినవారూ ప్రపంచవ్యాప్తంగా గల ముస్లింలందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తోంది.

9/11 దాడి జరిగినప్పటి నుండి అమెరికా సామ్రాజ్యవాదం 'టెర్రరిజంపై యుద్ధం' పేరుతో ప్రపంచవ్యాప్తంగా ముస్లిం ప్రజలను మరింతగా దాడికి లక్ష్యాలుగా చేసుకుంటూ వస్తోంది. ఈ దాడి కేవలం రాజకీయ, మిలటరీ, ఆర్థిక రంగాల్లోనే కాక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో కూడా కొనసాగుతోంది. అమెరికా, దాని మిత్రదేశాల ఈ సాంస్కృతిక సామ్రాజ్యవాద దాడిరూపాల్లో పచ్చి క్రిస్టియన్ మత దురహంకార వ్యక్తీకరణలు, అబూ గ్రాయిబ్‌లో జరిగిన దారుణమైన చిత్రహింసల నుండి మొదలుకొని, మహమ్మద్ ప్రవక్తను, ఖురాన్‌ను, యితర ఇస్లాం మత సంకేతాలను కార్టూన్‌లలో, సినిమాలలో వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో అవమానించడం వరకు వున్నాయి. ఈ సాంస్కృతిక దాడి ముస్లింల మానసికతను దెబ్బతీసి, తాము తక్కువవారమని భావించేలా చేయడానికి, తద్వారా 'టెర్రరిజం మీద యుద్ధం' పేరిట తమపై జరుగుతున్న అత్యాచారాలనూ, సామ్రాజ్యవాద దురాక్రమణలనూ ప్రతిఘటించకుండా వుండడానికి ఉద్దేశింపబడింది. అయితే అమెరికా సామ్రాజ్యవాదులు ఘోరంగా పొరబడ్డారు. ముస్లిం ప్రజానీకాన్ని దెబ్బ తీయడానికి ఉద్దేశించిన ప్రతి అవమానం తిరిగి ఒక బ్రహ్మాండమైన నిరసనగా ఎగిసి వారి ముఖంపై పిడిగుద్దుగా మారుతోంది. ఇందుకనుగుణంగానే ఈ సినిమా ఒక సాంస్కృతిక అంశంపై ప్రపంచం మునుపెన్నడూ ఎరుగని స్థాయి నిరసనలకు దారితీసింది. ఈ నిరసన రూపాల్లో బ్రహ్మాండమైన ప్రదర్శనలు, నిరసన ర్యాలీలు, అమెరికా జెండా, ఆస్తులు, ఇతర అమెరికా సంకేతాల దగ్ధం, విధ్వంసం నుండి మొదలుకొని అమెరికా దౌత్య కార్యాలయాల మీద దాడులు, వారి దౌత్యవేత్తల హత్యల దాకా వున్నాయి.

అపూర్వ స్థాయిలో వెల్లువెత్తుతున్న ఈ ఆగ్రహం కేవలం మహమ్మద్ ప్రవక్తను అవమానపరచడానికి వ్యతిరేకంగా మాత్రమే కాదనీ, అమెరికా సామ్రాజ్యవాదులు ముస్లిం ప్రజానీకం మీద, ముఖ్యంగా ఇరాక్, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో కొనసాగించిన అన్ని రకాల అత్యాచారాలకూ, జియోనిస్టు ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజల మీద కొనసాగిస్తున్న అత్యాచారాలకు అది నిస్సిగ్గుగా అందిస్తున్న మద్దతుకీ వ్యతిరేకంగా వారిలో ఎన్నాళ్ల నుండో రగులుతున్న ద్వేషంలో కూడా భాగమనీ మనం అర్థం చేసుకోవాలి. ఈ నిరసనలను ఒక మత సముదాయం కేవలం ఒక మత సంబంధమైన విషయంలో చేస్తున్న నిరసనలుగా మాత్రమే కాక ఒక విశాలమైన అర్థంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ సంస్కృతి సహా అన్ని రంగాల్లో చేస్తున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో భాగంగా చూడాల్సి వుంటుంది. అమెరికా, నాటో బలగాలు గల్ఫ్ ప్రాంతంలోని దేశాలను ఆక్రమించి, అక్కడి చమురు నిల్వలను దోచుకోవడానికి చేసిన దురాక్రమణ యుద్ధాలు, సమృద్ధమైన వనరులు గల అరబ్, ఉత్తర ఆఫ్రికా దేశాలపై చేస్తున్న నయా వలసవాద దోపిడీ, లూటీ అనేవి అమెరికా పట్ల వ్యక్తమవుతున్న ఈ ద్వేషం వెనుక గల ముఖ్య కారణం. ఈ దేశాల్లోని అత్యధిక మెజారిటీ జనాభా అయిన ముస్లిం ప్రజల ప్రతిఘటనను దెబ్బ తీయడానికి అమెరికా కుట్రపూరితంగా, ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఇస్లాం వ్యతిరేక ప్రచారం, చర్యల వల్లనే ప్రధానంగా ఇది మతపరంగా మారింది.

ఈ నిరసనలు వెల్లువెత్తుతున్న దేశాల్లో అధికారంలో వున్న దళారీ పాలకవర్గాలు, తమ అసలు స్వభావానికి అనుగుణంగానే తూటాలు, టియర్ గ్యాస్, లాఠీ చార్జీలు, అరెస్టులతో నిరసనకారుల్ని అణచివేయ ప్రయత్నిస్తున్నారు. అనేక దశాబ్దాలుగా ఈ పాలకవర్గాలు ఒకవైపు సామ్రాజ్యవాదులకు పెంపుడు కుక్కల్లాగానూ, మరోవైపు తమ స్వంత ప్రజలపై కరడు గట్టిన నిరంకుశులుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఒకవైపు అమెరికా డ్రోన్ విమానాలు అఫ్ఘన్ గ్రామాలపై ఎడతెరిపిలేని దాడులు చేస్తూ రోజువారీ కార్యక్రమంగా అక్కడి అమాయక ప్రజలను చంపుతూ వుంటే, ముస్లిం ప్రపంచం ఒక్కటై ఈ సినిమా రూపంలో జరిగిన అమెరికా సాంస్కృతిక దాడికి నిరసనగా పైకి ఎగుస్తూ వుంటే,

కర్జయ్‌గారు మాత్రం 'టెర్రరిజంపై యుద్ధం' కొనసాగాల్సిందేననీ, అయితే అఫ్ఘన్ గ్రామాల్లో మాత్రం దీన్ని కొనసాగించవద్దని ఒబామాని బతిమాలుకుంటున్నారు. ఇటువంటి కీలుబొమ్మలు కూడా ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులు ముస్లింల మీద అసంఖ్యాకంగా జరుగుతున్న దాడులకు అంతే బాధ్యులవుతారు. ఇటువంటి సాంస్కృతిక దాడులు జరిగినప్పుడు వీరు ఎన్నడూ ముస్లిం ప్రజల ఆత్మగౌరవాన్ని ఎత్తిపట్టరు. ప్రజలే ఇటువంటి కుమ్మక్కుదారుల అసలు ముఖాన్ని ఎండగట్టాల్సి వుంటుంది.

నిరసనల స్థాయిని చూసి నిర్ఘాంతపోయిన అమెరికా ప్రభుత్వం మహా ఆలస్యంగా 70,000 డాలర్లకు పైగా సొమ్మును ప్రకటనల మీద ఖర్చు చేసింది. వీటిలో ఒబామా, హిల్లరీ క్లింటన్‌లు అమెరికా ఎల్లప్పుడూ అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ వచ్చిందని సందేశాలు ఇస్తూ నిరసన వెల్లువను ఆపడానికి విఫలయత్నాలు చేశారు. మొదటగా అసలు ఈ సినిమా కేవలం ఎవరో ఒక మనిషి తన ఊహలు, భావాల వల్ల తీసింది కాదు. అమెరికా ప్రభుత్వమూ, దాని మిత్ర దేశాలూ బహిరంగంగానూ, రహస్యంగానూ 'టెర్రరిజంపై యుద్ధం'లో భాగంగా ప్రాయోజితం చేసి, మద్దతునిచ్చి, ప్రోత్సహించిన యావత్ ఇస్లాం వ్యతిరేక ప్రచారంలో ఇది ఒక విడదీయరాని భాగం. అఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైనికులు ఖురాన్‌ను తగులబెట్టడం వంటి అనేక ఉద్దేశపూర్వక, అవమానించే చర్యల్లో ఇది యిటీవలది మాత్రమే. ఈ నేపథ్యం లేకపోయి వుంటే ఇటువంటి సినిమాలను ఇంత సులభంగా తీసీ వుండేవారు కాదు, అవంత సులభంగా విడుదలయ్యేవీ కావు.

అమెరికా ప్రభుత్వ బ్రహ్మాండమైన నిఘా వ్యవస్థను దృష్టిలో వుంచుకున్నప్పుడు ఈ సినిమాని తీయడం గురించి గానీ, దాని విడుదల గురించి గానీ దానికి తెలీదని నమ్మడం అమాయకత్వమైనా అవుతుంది లేదా మనల్ని మనం మోసగించుకోవడమైనా అవుతుంది. ఇంత పెద్దెత్తున నిరసనలు వ్యక్తమైన తర్వాత కూడా అమెరికా ప్రభుత్వం ఈ సినిమాని తీసినవాళ్లని అరెస్టు చేయడానికి గానీ, దాని విడుదలను నిలుపుదల చేయడానికి గానీ, ముస్లింలకు క్షమాపణ చెప్పడానికి గానీ సిద్ధంగా లేదు. అది సమయాన్ని గడిపేయడానికి ప్రయత్నిస్తూ అన్ని మతాల్నీ గౌరవిస్తామంటూ నామమాత్రమైన, అస్పష్టమైన ఖండనలూ, ప్రకటనలూ యిస్తూ ప్రజల్ని మోసగించ జూస్తోంది. కానీ చరిత్ర ఇందుకు భిన్నమైన సాక్ష్యాన్నిస్తోంది. అంతే కాకుండా, తన పౌరుల్ని నిరసనకారుల నుండి కాపాడుకునే సాకుతో అది లిబియా వంటి దేశాల్లోకి నేరుగా తన సైనికుల్ని పంపిస్తూ వాటి సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తోంది.

ముస్లిం ప్రజానీకానికి అమెరికా సామ్రాజ్యవాదపు దుర్మార్గాలతో తగినంత అనుభవం వుంది కనుకనే దాని మోసాన్ని గ్రహించారు. అందుకే అమెరికాకీ, దాని పశ్చిమ మిత్రదేశాలకూ వ్యతిరేకంగా నానాటికీ శాంతియుతమైన, హింసాత్మకమైన నిరసనలు మరింతగా ఎగుస్తున్నాయి. సామ్రాజ్యవాద యుగపు నీరోలైన పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు ముస్లింల పట్ల ఎంత బాధ్యతారహితమైన, దుర్మార్గమైన వైఖరిని కలిగి వుంటారనే విషయాన్ని ఒక పక్క ప్రపంచం అంతా ఈ సినిమాకు వ్యతిరేకంగా మండిపోతుంటే ఫ్రాన్స్‌లోని ఒక పత్రిక మహమ్మద్ ప్రవక్తను అవమానిస్తూ 20 కార్టూన్‌లను ప్రచురించడాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఫ్రాన్స్ ముందస్తు హెచ్చరికగా 20 దేశాల్లో తన దౌత్య కార్యాలయాల్ని మూసివేసింది. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ లెబనాన్‌పై చేసిన దురాక్రమణ దాడిని విజయవంతంగా తిప్పికొట్టిన, సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలు గల హసన్ నస్రల్లా వంటి నేతలు మరింత విస్తృతమైన నిరసనలు తెలపల్సిందిగా పిలుపునివ్వడంతో మరొక విడతగా నిరసనలు వెల్లువెత్తాయి.

మత సామరస్య భావాలు గల ప్రతి ఒక్కరూ, ప్రతి ప్రజాస్వామికవాది ఈ నిరసనల్లో పాల్గొని ప్రత్యేకంగా ఇస్లాం మతస్తులను టార్గెట్ చేస్తున్న అమెరికా, యూరోప్ సామ్రాజ్యవాదుల సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని ఖండించాలి. మత మనోభావనలను గాయపర్చడం అనేది సాంస్కృతిక సామ్రాజ్యవాదంలో ఒక భాగం మాత్రమే. ఈ సాంస్కృతిక సామ్రాజ్యవాదపు రాకాసికున్న ఇతర అనేక కోరలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల స్థానిక సంస్కృతిని (భాషలు, యాసలు, ఆహారపు అలవాట్లు, కట్టు, కట్టడాలు - ఒకటనేంటి, అన్నిటినీ) ఎలా గొంతు నులిమివేస్తున్నాయో ఈ నిరసనల సందర్భంగా బహిర్గతం చేయాలి. అమెరికా ప్రభుత్వమూ, ఈ సినిమా తీసినవారూ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడంతో పాటు ఈ నిరసనలు విశాలమైన సామ్రాజ్యవాద వ్యతరేక పోరాటాలుగా, ప్రత్యేకించి వెనుకబడిన దేశాల్లో తన భౌగోళిక-రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికీ, ఆ దేశాల్లోని చమురు, ఇతర సహజ సంపదలనూ దోచుకోవడానికీ అక్కడి ముస్లింలను టార్గెట్ చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలుగా మారాల్సిన అవసరం వున్నది.

Abhay

(అభయ్ )
అధికార ప్రతినిధి
కేంద్ర కమిటీ
సీపీఐ (మావోయిస్టు)